నాగలింగేశ్వరుడిగా ఎర్రి నాగప్ప

- 13న బ్రహ్మా రథోత్సవం
- 14న లంకా దహనం



నాగలింగేశ్వరస్వామి మూల విరాట్



నీలంపల్లిలో ఉత్సవాలకు సిద్ధమైన నాగలింగేశ్వరుడి దేవాలయం

బుక్కరాయసముద్రం: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన పుణ్య క్షేత్రాల్లో అతి పురాతనమైన దేవ స్థానం నీలంపల్లి నాగలింగేశ్వర స్వామి దేవస్థానం ఒకటి. ఇక్కడ వెలసిన కలియుగ దైవం నాగలింగేశ్వరస్వామిని సాక్షాత్తూ పరమేశ్వరుడిగా భక్తులు కొలుస్తున్నారు. నీలంపల్లిలో వెలసిన నాగలింగేశ్వర స్వామి కలియుగంలో అవతరించి భక్తులకు కోర్కెల తీర్చే కల్ప తరువుగా ఆపదలో ఉన్న వారికి అనాథ రక్షకుడిగా విరాజిల్లుతున్నాడు. పాల్గుణ మాసంలో పౌర్ణమి రోజు నాగలింగేశ్వరస్వామిని దర్శించుకుంటే భక్తులు కోర్కెలు సిద్ధిసాయని ప్రతీతి. ఏటా పాల్గుణ మాసంలో గ్రామస్తులు నాగలింగేశ్వరస్వామి ఉత్సవాలు, తిరునాల నిర్వహిస్తారు.

ఆలయ చరిత్ర

జిల్లా కేంద్రం అనంతపురానికి 12 కిలో మీటర్ల దూరంలోని నీలంపల్లిలో పూర్వం ఎర్రినాగప్ప అనే సాధువు పిచ్చిగా మాట్లాడుతూ తిరుగుతుండేవారని పెద్దలు చెబుతుంటారు. గ్రామంలో ఆపదలో ఉన్న వారికి చిన్న చిన్న మహిమలు చూపుతూ ప్రజలకు ఆశ్చర్య చకితులను చేసేవారన్నారు. ఆయన కోరిక మేరకు గ్రామస్తులు సాధువును జీవ సమాధి చేసి, చిన్న గుడి కట్టారు. గ్రామంలో ఏ కుటుంబంలోనైనా చిన్న సమస్య వచ్చినా ఎర్రినాగప్ప సమాధి వద్దకు వచ్చి పూజలు నిర్వహించేవారు. సమస్యలు నెరవేరుతుండడంతో భక్తుల సంఖ్య పెరిగింది. ఈ క్రమంలో గుడి పెద్దగా నిర్మించి ఎర్రినాగప్పను నాగలింగేశ్వరుడిగా పిలవసాగారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నాగలింగేశ్వరుడికి ప్రతి సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తు వస్తున్నారు. అలాగే మండలంలో ఏ ఎన్నికలు జరిగినా పోటీ చేసే అభ్యర్థులు నాగలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాతే ప్రచార కార్యక్రమాలు చేపట్టడడం ఆనవాయితీ.

ఉత్సవ కార్యక్రమాల వివరాలు

నాగలింగేశ్వరుడి ఆలయంలో ఈ నెల 13న రాత్రి 10.30 గంటల నుంచి 12.20 గంటల లోపు గణపతి పూజ, పుణ్యాహ వచనం, మహా మంగళ హారతి, ప్రాకార సంప్రోక్షణ, నిర్వహించనున్నారు. రాత్రి 12 గంటలకు స్వామి రథోత్సవాన్ని గ్రామంలో ఊరేగించనున్నారు. ఇదే రోజున భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. అలాగే 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకూ ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకూ లంకా దహనం, పెద్ద రంగు రంగుల టపాసులు కాల్చనున్నారు. వీటిని వీక్షించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు. రాత్రి జరిగే ఈ తిరునాలకు పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు నిర్వహించనున్నట్లు టీకేఎస్ సీఐ కరుణాకర్ తెలిపారు.

రాజీ మార్గమే రాజమార్గం



గుత్తిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఏడీజే శ్రీహరి

తాడిపత్రి రూరల్: రాజీ మార్గమే రాజమార్గమని జడ్జి క్రిష్ణవేణి సూచించారు. స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ ద్వారా 261 కేసులు పరిష్కారమయ్యాయి. కోర్టు ప్రాంగణంలో మెజిస్ట్రేట్ క్రిష్ణవేణి ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్‌లో వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన పలు సివిల్ కేసులు, చెక్ బౌన్స్‌ల కేసులు, ప్రామిసనరీ నోట్ల కేసులు పరిష్కారమయ్యాయి.

గుత్తి: పట్టణంలోని ఏడీజే కోర్టులో శనివారం ఏడీజే శ్రీహరి, జూనియర్ సివిల్ జడ్జి శ్వేత ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని రకాల కేసులు కలిపి మొత్తం 175 పరిష్కారం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పీడీ రత్నం, న్యాయవాదులు, పోలీసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. లోక్ అదాలత్‌కు హాజరైన వారందరికీ లయన్స్ క్లబ్ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు, చిత్రచేడు, గుత్తిఅనంతపురం గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు శనివారం తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చర్చిల్లో స్త్రీల మైత్రి ఆరాధన

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో రెండో శనివారాన్ని పురస్కరించుకొని స్త్రీల మైత్రి ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్త్రీల మైత్రి ప్రెసిడెంట్, పాస్టర్ సువర్ణమ్మ సంఘం మహిళా సభ్యులను ఉద్దేశించి ప్రసంగించారు. సంఘంలో స్త్రీల ప్రాముఖ్యత, ప్రార్థన అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం మహిళా సభ్యులు, ప్రిస్కిల్లా, రేచెల్, మెర్సీ, మహిమ, వాణి, రజని తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని పత్తి కొండ రోడ్డు ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై శనివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. తుగ్గలి మండలం రాతనకు చెందిన రంగారెడ్డి బైక్‌లో గుత్తికి వస్తుండగా వెనుక నుంచి ఆటో ఢీ కొంది. ప్రమాదంలో రంగారెడ్డి గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

మామిడి తోట దగ్ధం

గుంతకల్లు రూరల్: గుండాల తండా గ్రామంలో శనివారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ మామిడితోట దగ్ధమైంది. వివరాలు.. తండాకు చెందిన చంద్రకళ తనకున్న 5 ఎకరాల పొలంలో 15 ఏళ్ల క్రితం 350 మామిడి మొక్కలు సాగు చేసింది. పదేళ్ల నుంచి ఏటా రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ రైతుకు ఆదాయాన్ని సమకూరుస్తున్నాయి. అయితే మధ్యాహ్నం సమయంలో తోటలో ఒక్కసారిగా మంటలు చెలరేగి మామిడిచెట్లతో పాటు డ్రిప్ పరికరాలు, పైపులు కాలిపోయాయి. ఘటనలో భారీ నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరారు.

కదిలే స్పీడ్ బ్రేకర్లు!



తాడిపత్రి-కడప ప్రధాన రహదారిపై అడ్డుగా ఉన్న పశువులు

- రోడ్లపై తిష్టవేస్తున్న పశువులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తాడిపత్రి: పశువులు రోడ్లపైనే తిష్టవేస్తుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని గన్నెవారిపల్లి పంచాయతీ ప్రాంతం మూడు జిల్లాలకు సరిహద్దుగా ఉంటుంది. నిత్యం తాడిపత్రి నుంచి అనంతపురం, వైఎస్సార్, నంద్యాల జిల్లాలకు వెళ్లే ప్రధాన రహదారులు వేల వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటాయి. ప్రధాన రహదారులపై పశువులు తిష్టవేసి ఉండడంతో ఇటు పాదచారులు అటు వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు.

రోడ్లపైనే సంచారం..

తాడిపత్రి మున్సిపాలిటీ, రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీ తదితర ప్రాంతాల్లో మూగజీవాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పశువులు రహదారిపై పడుకోవడం, రహదారులపై గంటల కొద్ది నిలిచి ఉండడంతో పాటు సమీప కాలనీల్లోని వీధుల్లో సైతం యధేచ్ఛగా సంచరిస్తున్నాయి. దీంతో వాహనదారులకు ఓ వైపు రాకపోకలకు ఇబ్బందులు కలగడంతో పాటు, ఆయా కాలనీల్లో మహిళలపై పశువుల దాడులు తప్పడం లేదు. మూగజీవాల సంరక్షణపై యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోడ్లపైకి వదిలిపెడుతున్నారు. దీంతో ఆయా పశువులు కదిలే స్పీడ్ బ్రేకర్లుగా తయారయ్యాయని వాహనదారులు వాపోతున్నారు. పశువులను కట్టడి చేయడంలో యజమానులు నిర్లక్ష్యం వహించడం వల్ల రాత్రి పూట పశువులు రహదారులపైనే నిద్రిస్తున్నాయి. దీంతో వాహనదారులు చీకట్లో మూగజీవాలను ఢీ కొట్టి ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు చాలానే ఉన్నాయి. దీనికి తోడు మూగ జీవాలు కూడా గాయపడుతున్నాయి. నూతన కూరగాలయ మార్కెట్, బస్టాండ్ సర్కిల్, కడప రోడ్డు, రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ తదితర ఏరియాలలో పశువులు వాహనాలకు స్పీడ్ బ్రేకర్లుగా మారాయి.

పట్టించుకోని అధికారులు..

రహదారులపై ఇష్టారాజ్యంగా తిరుగుతున్న మూగ జీవాలను నియంత్రించడంలో అధికారులు చోద్యం చూస్తున్నారు. వాహనచోదకులు, ప్రజలు వీటి వలన ప్రమాదాలకు గురవుతున్నా అధికారులు శ్రద్ధ చూపడంలేదన్న విమర్శలు ఉన్నాయి. మూగ జీవాల యజమానులకు నోటీసులు జారీ చేసి, అపరాధ రుసుం వసూలు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని పట్టణ, మండల వాసులు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగులకు శిక్షణ



మాట్లాడుతున్న శిక్షకుడు రాఘవేంద్ర



హాజరైన సచివాలయ ఉద్యోగులు

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వామిత్వ పథకంపై గుంతకల్లు డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. డివిజనల్ పంచాయతీ అధికారి శివాజీరెడ్డి ఆధ్వర్యంలో శిక్షకులు హర్షవర్ధన్, రాఘవేంద్ర శిక్షణ ఇచ్చారు. శనివారం జరిగిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో గ్రామ పంచాయతీలో సర్వే నిర్వహించి ఖాళీగా ఉన్న స్థలాలు, గుడులు, బడులు, మసీదు, చర్చిలను గుర్తించి రికార్డులలో నమోదు చేయాలన్నారు. మొత్తం 42 అంశాలకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో పర్యటించి సర్వే చేసి వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, అక్కడ ఉన్న వనరులను గుర్తించాలన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన ప్రకారం స్వామిత్వ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు సాదిక్, ధనలక్ష్మి, ఎర్రిస్వామి, రాము, బాషా, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల అర్జీలపై స్పందించండి



మాట్లాతున్న సీపీఐ నాయకుడు జగదీష్

గుంతకల్లు: ఇంటి స్థలాల కోసం సీపీఐ ఆధ్వర్యంలో అధికారులకు అందజేసిన అర్జీలపై తక్షణమే స్పందించి పేదలకు న్యాయం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇంటి స్థలాల లేని నిరుపేదల కోసం సీపీఐ ఆధ్వర్యంలో అర్జీలు సేకరించి అధికారులు అందజేశామన్నారు. అర్హులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అదేవిధంగా రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు మంజూరు చేయడం లేదన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు అందజేయకపోవడంతో శిథిలావస్థకు చేరే ప్రమాదం ఉందన్నారు. ప్రభుత్వ లేఅవుట్లలో రోడ్లు, వీధిలైట్లు, డ్రైనేజీలతోపాటు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సమస్యలపై స్పందించకపోతే ప్రభుత్వ కార్యాలయాలను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.గోవిందు, ఎం.వీరభద్రస్వామి, బీ.మహేష్, గోపీనాథ్, రాముదాయల్, ఎస్ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



గుంతకల్లులో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం



గుంతకల్లులో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వీసీ మైమూన్ తదితరులు



గుత్తి కోర్టు ఆవరణలో మహిళలను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక బ్రహ్మకుమారి ఈశ్వరియ విశ్వవిద్యాలయ కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం ఇన్‌చార్జ్ బీకే శకుంతల ఆధ్వర్యంలో కౌన్సిలర్ నాగరత్న, ఇన్నర్ వీల్ క్లబ్ పట్టణ అధ్యక్షురాలు అర్చనా కార్వా, అంగన్‌వాడీ సూపర్ వైజర్ శ్రీదేవి తదితరులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈశ్వరీయలు బీకే పార్వతీ, బీకే గిరిజ తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం సందర్భంగా పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాముడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని, వైస్ చైర్‌పర్సన్ మైమూన్, కమిషనర్ నయీమ్ అహ్మద్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శాంతి మాట్లాడారు. మహిళలు విద్యావంతులైనప్పుడే సమాజం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. అనంతరం బ్యాంకుల ద్వారా స్వయం సహాయక సంఘాలకు మంజూరైన రూ.1.67 కోట్ల మెగా చెక్కును సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మెప్మా టీపీఆర్ఓ మోహన్, సిటీ మిషన్ మేనేజర్ కెరణ్, కౌన్సిలర్లు, సీఓలు, డ్వాక్రా లీడర్లు పాల్గొన్నారు.

గుత్తి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం మెప్మా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా, చైర్ పర్సన్ వన్నూర్‌బీ, మెప్మా అధికారులు శ్రీనివాస రెడ్డి, చంద్రశేఖర్, సురేఖ, ఆర్‌పీలు పాల్గొన్నారు. అలాగే గుత్తిలోని జడ్ వీరారెడ్డి కాలనీలో మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, మహిళా సంఘం అధ్యక్షురాలు కవిత, సహాయ కార్యదర్శి రేవతి, సభ్యులు కృష్ణవేణి, రామలక్ష్మి, వెంకట లక్ష్మి, హేమలత, దుర్గమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చల్లవారిపల్లిలో వృద్ధ మహిళ లక్ష్మీదేవిని సర్పంచ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ సత్యనారాయణ, మండల విస్తరణాధికారి వెంకటేష్, తాడిపత్రి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏడీజే శ్రీహరి సతీమణి శ్యామల, సీనియర్ సివిల్ కాశీ విశ్వనాథ్ చారి సతీమణి కుసుమాంజలి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ నాయకురాలు రుఖియా బేగం, హేమలత తదితరులు జడ్జీల సతీమణులతో పాటు పలువురు మహిళలను సన్మానించారు.

తాడిపత్రి రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోర్టులో జడ్జి క్రిష్ణవేణి తన మాతృమూర్తిని శాలువాతో సన్మానించి కేక్ కట్ చేయించారు. అంతకు ముందు కోర్టు సూపరింటెండెంట్ ఉపేంద్ర ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులు, సిబ్బందికి ఆటలు, వక్తృత్వ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఏజీపీ భాస్కర్‌రెడ్డి, న్యాయవాదులు రఘుపతి, సదాశివారెడ్డి, రాజేశ్వరి, రేష్మాపర్వీన్, ఫరీద, మౌనిక ఆర్సీ రజనీకాంత్‌రెడ్డి, చక్రపాణి, శంకర్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్(పెద్దపప్పూరు): పెద్దపప్పూరు మండలంలోని చిన్నపప్పూరులో ఉన్న మౌర్య పాఠశాల ఆవరణలో మండలంలోని శింగనగుట్టపల్లి, జూటూరు, పెద్దపప్పూరు, చాగల్లు, తబ్జుల గ్రామాలకు చెందిన ఆర్డీటీ మహిళా సంఘం సభ్యులు మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫెర్రర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, ఆర్డీటీ ఏరియా టీం లీడర్ లలిత, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, మండల ఇన్‌చార్జ్ ఈశ్వర్ సత్కరించారు

పెద్దవడుగూరు(యాడికి): యాడికి మండలం రాయలచెరువు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి పాల్గొని మహిళలతో కేక్ కట్ చేయించారు. అలాగే పెద్దవడుగూరు మేడిమాకులపల్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అప్పయ్య తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, ఎంపీహెచ్ఓ లక్ష్మన్న, సీహెచ్ఎస్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయంలో సర్పంచ్ పార్వతి అధ్యక్షతన మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు.



తాడిపత్రిలో మాతృమూర్తి చేత కేక్ కట్ చేయిస్తున్న మెజిస్ట్రేట్ క్రిష్ణవేణి



పామిడిలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

వైభవంగా చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు



చెన్నకేశవస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రం యాడికిలో ఉన్న చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఆలయ కమిటీ సభ్యులు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి హాజరై ఆలయంలో పూజలు చేశారు. అనంతరం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఎమ్మెల్యే పరిచయం చేసుకుని క్రీడలు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

వైఎస్ఆర్‌ను కలసిన న్యూడెమోక్రసీ నాయకులు



గుంతకల్లుటౌన్: హైదరాబాద్‌లో సర్జికల్ సర్జరీ చేయించుకుని ఇటీవల గుంతకల్లుకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. శనివారం ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్, సభ్యులు రఘునాథరెడ్డి, జిలాన్, తదితరులు వైఎస్ఆర్‌ను ఆయన నివాసంలో కలిసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

గుత్తి రూరల్: మండలంలోని శ్రీపురంలో మహాలక్ష్మిదేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో శనివారం వేకువజాము నుంచి అమ్మవారికి అర్చకులు మహా మంగళ హారతి, అర్చన, అభిషేకాలు, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


కొండమీద రాయుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కొండమీద రాయుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సిద్ధరాంపురం రోడ్డు సమీపాన దేవర కొండపై వెలసిన కొండమీద రాయుడి ఆలయంలో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారికి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవర కొండ కింద ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శనీశ్వరుడికి తైలాభిషేకం



అలంకరణలో శనీశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని తాడిపత్రి రహదారి పక్కన శనీశ్వరుడి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో ప్రధాన అర్చకుడు బాబాస్వామి శనీశ్వరుడి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు కుంకుమాభిషేకం అర్చనలు, తైలాభిషేకం చేసి, పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వాహనాల తనిఖీ

గుత్తి: గుత్తిలోని ఎన్టీఆర్ సర్కిల్, ఆర్ఎస్‌లోని పత్తి కొండ రోడ్డులో శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్, ఏఎస్ఐలు నాగ మాణిక్యం, ఆజాద్, పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, ఆర్‌సీ, లైసెన్స్‌లు లేని వాహనాల డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులపై జరిమానా విధించారు.

చలివేంద్రాల ప్రారంభం



మెయిన్‌బజార్‌లో చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

పామిడి: మండల కేంద్రంలోని మెయిన్‌బజార్‌లో కన్నెమూల విద్యా వినాయక సమితి, వస్త్రవ్యాపారుల సంయుక్త ఆధ్వర్యంలో, స్థానిక ఎద్దులపల్లిరోడ్డు సర్కిల్, పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శనివారం చలివేంద్రాలు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి అత్యవసర పనిమీద వచ్చే వారికి చలివేంద్రాలు ఉపయోగం పడతాయన్నారు. వస్త్రవ్యాపారులు ఒక చలివేంద్రాన్ని, మిగతా రెండు చలివేంద్రాలను గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు, మండల ఇన్‌చార్జ్ ఈశ్వర్ ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు, వస్త్ర వ్యాపారులు పాల్గొన్నారు.